క్లుప్తంగా

ఈవోపీఆర్డీగా జవహర్‌బాబు

తంబళ్లపల్లె: పంచాయతీరాజ్ ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఈవోపీఆర్డీగా జవహర్‌బాబు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో ములకలచెరువు ఈవోపీఆర్డీగా ఉండగా డిప్యూటేషన్‌పై తంబళ్లపల్లెకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి, సకాలంలో మెరుగైన ప్రభుత్వ సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

పాలిసెట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

కలికిరి: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష -2023కు కలికిరిలో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కేంద్రంలో 309, సీకాం డిగ్రీ కళాశాల కేంద్రంలో 307, ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో 275, ఏపీ ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో 200, అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల కేంద్రంలో 89 మంది అభ్యర్థులు ప్రవేశ పరీక్షకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పరీక్షకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

గ్రామ సమాఖ్యల పనితీరు భేష్

తంబళ్లపల్లె: మండలంలో అమలవుతున్న వైఎస్సార్‌క్రాంతిపథం మండల సమాఖ్య, గ్రామ సమాఖ్యల పనితీరు భేష్ అని ఆడిటర్ గౌతమ్ సంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం స్త్రీశక్తి భవన్‌లో మండల సమాఖ్య, గ్రామ సమాఖ్యల పనితీరు ,ఏప్రిల్ 2022 నుండి మార్చి 31-2023 వరకు జరిగిన బ్యాంకు లావాదేవీలు,పుస్తక నిర్వహణ తదితరాలపై ఆడిట్ నిర్వహించారు. సమాఖ్యల పనితీరు బాగుండటంతో మండలంలో మహిళా సంఘాలు పటిష్టమై మంచి ఆర్థిక అభివృద్ధి సాధిస్తున్నట్లు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ఆడిటింగ్ మూడు రోజులు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీయం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మేడికుర్తి సచివాలయంలో ఆధార్ కేంద్రం ప్రారంభం

కలికిరి: మండలంలోని మేడికుర్తి గ్రామ సచివాలయంలో మంగళవారం నుంచి ఆధార్ కేంద్రం ప్రారంభించినట్లు మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్ రెడ్డి, కార్యదర్శి రమేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆధార్ నమోదు, అప్‌డేట్, సవరణలకు అనుకూలంగా ఆధార్ కేంద్రం ప్రారంభించడం జరిగిందని, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

కర్ణాటక సీఎంపై కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

మదనపల్లె : కర్ణాటక సీఎం బసవరాజు బొమ్మై, బీజేపీ నాయకులపై మదనపల్లె టౌన్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ రెడ్డిసాహెబ్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే హత్యకు కుట్ర పన్నిన బీజేపీ నాయకులపై కేసు నమోదు చేయాలని టూటౌన్ సీఐ మురళీకృష్ణకు ఫిర్యాదు అందజేశారు. బీజేపీ కుట్రరాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు.

ఆర్‌బీకేలకు చేరిన వేరుశనగ విత్తన కాయలు

పెద్దతిప్పసముద్రం: ఖరీఫ్ సీజన్‌కు ముందే రాయితీ వేరుశనగ విత్తన కాయలను రైతాంగానికి అందజేసేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాలకు ఇప్పటి వరకు ఐదు వేల బస్తాల కాయలు మంజూరైనట్లు ఏఓ ప్రేమలత మంగళవారం పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో కాయలు వచ్చాక ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటిని రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

పాముకాటుతో మహిళకు తీవ్ర అస్వస్థత

మదనపల్లె : పాముకాటుకు గురై ఓ మహిళ తీవ్ర అస్వస్థతకు లోనైన సంఘటన మంగళవారం చౌడేపల్లె మండలంలో జరిగింది. బోయకొండ సమీపంలోని మేకలవారిపల్లెకు చెందిన శ్రీనివాసులు భార్య గంగులమ్మ (45) ఇంటి సమీపంలోని చెత్తాచెదారం, గడ్డి తొలగిస్తుండగా అకస్మాత్తుగా పాము కాటేసింది. దీంతో ఆమె తీవ్ర అస్వస్థతకు గురికాగా గమనించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 15 మంది ఎంపిక

పీలేరు : స్థానిక ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 15 మంది ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ అవినాష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌కు చెందిన టాటా స్ట్రైవ్ హెచ్‌ఆర్ అఖిల్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు 60 మంది అభ్యర్థులు హాజరు కాగా 15 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ. 2.5 లక్షలు వేతనం అందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె : ప్రతి క్షణం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గర్నిమిట్ట పంచాయతీలో మంగళవారం వంకాటపల్లె, బాటవారిపల్లె, ఆవులయ్యగారిపల్లె తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను తక్షణం పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాలకు కొత్తగా బోరు డ్రిల్లింగ్ చేయడం తోపాటు కొత్త మోటారు ఏర్పాటు చేపిస్తామని హామీ ఇచ్చారు. పలువురు భూ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సకాలంలో పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. నాలుగేళ్లలో ప్రతి కుటుంబానికి ఏదో విధంగా ఆర్థికంగా లబ్ధి చేకూరుతోందని చెప్పారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా..

ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే అన్నారు. ఆవులయ్యగారిపల్లెలో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలని ముఖ్యమంత్రి మంచి ఆలోచనతో కొత్త కార్యక్రమం తీసుకొచ్చారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా ముఖ్యమంత్రికే చెప్పుకోవచ్చునని చెప్పారు. ప్రజలు తమ సమస్యలపై 1902కు కాల్ చేయవచ్చునని తెలిపారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగేదన్నారు. ప్రతి పథకంలో వివక్షత చూపే వారని పేర్కొన్నారు. జగనన్న ప్రభుత్వంలో పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రజలకు నేరుగా పారదర్శకంగా పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు మంచి మనుస్సుతో మరోసారి ముఖ్యమంత్రిని ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గజ్జెల శృతి, వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, సర్పంచ్ రమణమ్మ, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, నాయకులు సతీష్‌రెడ్డి, దినేష్ రెడ్డి, జయరామచంద్రయ్య, రాంప్రసాద్‌నాయుడు, రత్నాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ద్వారకనాథరెడ్డి, ధర్మారెడ్డి, సి.కె. యర్రమరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోబీ నిర్వాసితులకు రూ. 5.40 కోట్లు పంపిణీ

పీలేరు : పీలేరు పట్టణంలోని చిత్తూరు రోడ్డు మార్గంలో రైల్వే ఓవర్‌బ్రిడ్జి (ఆర్వోబీ)కి భూములు కోల్పోయిన బాధితులకు రూ. 5.40 కోట్లు మంజూరయ్యాయి. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చెక్కులు పంపిణీ చేశారు. అలాగే పూల వ్యాపారులకు లక్కీడిప్ ద్వారా వారపు సంతలో రూములు కేటాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. గతంలో రెవెన్యూ సమస్యలపై పలువురు ప్రజలు తమకు వచ్చేవారని, జగనన్న కాలనీల్లో సమస్యలపై తమ వద్దకు వచ్చేవారని తెలిపారు. ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా సత్వరం పరిష్కరించాలని సూచించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ హబీబ్‌బాషా, పార్టీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, వైస్ ఎంపీపీలు హరిత, చలపతి, జిల్లా కోఆప్టెడ్ సభ్యుడు షఫీ, మస్తాన్, హుమయూన్, ఆనంద్, ఉదయ్, నరసింహారెడ్డి, తహశీల్దార్ ప్రదీప్, ఆర్ఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడికి అభాకార్డు తప్పనిసరి

- డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్

కేవీపల్లె : ప్రతి పౌరుడికి అభా (ఆయుస్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) కార్డు తప్పనిసరి అని జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణాధికారి (డీపీఎంవో) డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. మంగళవారం మండలంలోని గ్యారంపల్లె పీహెచ్‌సీ పరిధిలో కలికిరి వాండ్లపల్లెలో అభాకార్డు నమోదు కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమీప గ్రామ సచివాలయంలో హెల్త్ సెక్రటరీని కలసి ఆధార్ నెంబరుతో లింక్ చేపించుకోవాలని కోరారు. అభా కార్డుతో హెల్త్ ఐడీ (పదమూడు అంకెలు) ప్రతి పౌరుడికి ఇవ్వడం జరుగుతుందన్నారు. దీంతో ప్రజల ఆరోగ్య పరిస్థితి అంతా అభా కార్డులో నమోదు చేయబడుతుందని తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల్లో ఈ నెంబరు చూపించి చికిత్స పొందవచ్చునని చెప్పారు. దేశ వ్యాప్తంగా ఒకే ఐడీ నెంబరుతో రోగి ఆరోగ్య పరిస్థితి ఆన్‌లైన్ చేయబడుతుందని తెలిపారు. అనంతరం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్య సేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పావనగౌరీ, హెచ్‌ఈ మహమ్మద్ రఫీ, ఎంపీహెచ్‌వో రేఖానాయక్, ఏఎన్ఎం దివ్యదీపిక, ఆశా ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కంటివెలుగు వరం

కలకడ : పేదలకు వరం వైఎస్సార్ కంటివెలుగు అని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఏపీఎంఓ పరశురాం అధ్యక్షతన 3వ విడత వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమం నిర్వహించారు. 50 సంవత్సరాలు పైబడిన వారికి కంటి పరీక్షలు చేశారు. వయస్సు పైబడిన వారు కంటిపరీక్షలు చేయించుకోవాలని, ఆకుకూరలు, పాలు, గుడ్లు సమపాలలో ఆహారంగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఉచితంగా కంటిపరీక్షలు, పరేషన్లు చేయించి, అవసరమైనవారికి అద్దాలు అందిచడం జరుగుతుందన్నారు. డాక్టర్ జవహర్‌బాబు, ఎంపీహెచ్ఈఓ జయరామయ్య పాల్గొన్నారు.

సారా స్వాధీనం

నిమ్మనపల్లె : సారా విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని తవళం పంచాయతీ కుమ్మరపల్లె గ్రామానికి సమీపంలో స్థానికురాలైన మల్లక్క సారా విక్రయిస్తుండగా దాడి చేసి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వైభవంగా హనుమాన్ శోభా యాత్ర

మదనపల్లె సిటీ: పట్టణంలో మంగళవారం సాయంత్రం హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో శ్రీ హనుమాన్ శోభాయాత్ర స్థానిక నీరుగట్టువారిపల్లె నుంచి యాత్రను ప్రారంభించారు. వందలాది మంది హిందూ చైతన్య వేదిక సభ్యులు స్కూటర్లపై ఊరేగింపులో పాల్గొన్నారు. యాత్రలో ప్రత్యేక వాహనంలో ఆంజనేయుడి విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. జై భోలో హనుమాన్‌కి జై... అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాషాయ వస్త్రాలు ధరించి యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక సొసైటీకాలనీలో ముగింపు సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ అతిథిగా పాల్గొన్న ఇస్కాన్ ప్రతినిధి రాధా మనోహర్‌దాస్ మాట్లాడుతూ సంస్కృతికి, సంప్రదాయాలకు భారతదేశం పుట్టినిలన్నారు. మన సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. అందరూ కలిసి మెలిసి జీవించాలన్నారు. కార్యక్రమంలో హిందూ చైతన్య వేదిక నాయకులు బండి బాలాజి, బీజేపీ నాయకులు ఏవీ సుబ్బారెడ్డి, బండి ఆనంద్, ఆర్ఎస్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పీలేరు రూరల్ : స్థానిక మోడల్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ పీలేరు ప్లాటినమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మంగళవారం బెంగళూరుకు చెందిన నారాయణ హృదయాలయం, కోలారు జాలప్ప మెడికల్ కాలేజి వైద్యులు సుమారు వందమందికి గుండె పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్లాటినమ్ గౌరవాధ్యక్షులు సంజీవరెడ్డి, అధ్యక్షులు వేణుగోపాల్, కార్యదర్శి ఏకాంతంరెడ్డి, ట్రెజరర్ షఫీ, రీజనల్ కోఆర్డినేటర్ రాజశేఖర్‌రెడ్డి, సభ్యులు హుమయూన్, జి. రమేష్‌రెడ్డి, రమణారెడ్డి, వైద్యులు కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో సురక్షిత ప్రసవం

పీలేరు రూరల్ : ప్రభుత్వాస్పత్రుల్లో సురక్షిత ప్రసవం జరుగుతుందని డాక్టర్ కార్తీక్ కుమార్ అన్నారు. మంగళవారం రేగళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ మాట్లాడుతూ రక్తహీనత లేకుండా తీసుకోవాల్సిన ఆహారం, ప్రభుత్వ పథకాలు, టీకాలు, తల్లిపాల ప్రాధాన్యత, తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు గూర్చి వివరించారు. డాక్టర్ శైలజ, సీహెచ్‌వో జయలక్ష్మీ, హెచ్‌ఈ ఉషారాణి, సూపర్‌వైజర్ విజయలక్ష్మీ, సీహెచ్‌వో నందిని, నాగప్రణీత, ఆరోగ్య కార్యకర్తలు మునీర్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు తప్పనిసరి

తంబళ్లపల్లె : మండలంలో గర్భిణులకు ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి అని డాక్టర్ మునికుమార్ తెలిపారు. మంగళవారం కోసువారిపల్లె పీహెచ్‌సీ ఆసుపత్రిలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులకు బీపీ, షుగర్, రక్తపరీక్షలు, బరువు పరీక్షలు నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకున్నప్పుడే రక్తహీనత దూరమవుతుందని సూచించారు. పీఎంవీవైై పథకం ద్వారా గర్భవతులకు పౌష్టికాహారం, వైద్య పరీక్షల కోసం రెండు విడతలుగా రూ.6వేలు లబ్ధిదారుల ఖాతాకు జమచేస్తారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం పొందాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుమతి, పీహెచ్ఎన్ సుమలత, ఎంపీహెచ్‌ఈవో రమణ పాల్గొన్నారు.

ప్రభుత్వపథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మదనపల్లె : సంక్షేమ పథకాలను ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఏఓ నాగప్రసాద్, హార్టికల్చర్ అధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని వేంపల్లె సచివాలయంలో సర్పంచ్ ఆదెమ్మ అధ్యక్షతన వ్యవసాయ, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న వివిధ పథకాలకు సంబంధించి ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ నాగప్రసాద్ మాట్లాడుతూ.. ఖరీఫ్-2023కు వేరుశెనగ విత్తన పంపిణీపై తెలుపుతూ... ఈ క్రాప్ నమోదు ఆవశ్యకతను రైతులకు తెలిపారు. ఎస్సీ,ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన కౌలురైతులకు 11 నెలలకు క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డ్స్ అందజేస్తామన్నారు. రైతులు ఉపయోగించుకోవాలన్నారు. హార్టికల్చర్ అధికారి ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి ఉద్యానపంటలకు సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రాయితీలపై వివరించారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పెద్దమండ్యం: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అన్నారు. మండలంలోని పాపేపల్లెలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పార్టీలకు అతీతంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. పాపేపల్లె, దాసరిపేట, గురివిరెడ్డిగారిపల్లె, గుడిశవారిపల్లె, పి తురకపల్లె గ్రామాలలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిశారు. జెడ్పీటీసీ పీరమ్మ, సర్పంచ్ పీరాన్‌బీ, ఎంపీటీసీ బోడిమాని గీత, మాజీ జడ్పీటీసీ రమేష్, మండల కన్వీనర్ చాను, రెడ్డెప్పరెడ్డి, సర్పంచ్‌లు విశ్వనాధరెడ్డి, విశ్వనాధ, గల్లా నరసింహులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఓటు వేయండి

- ఎమ్మెల్యే నవాజ్‌బాషా



ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, అమలైన సంక్షేమ పథకాలను గుర్తుంచుకుని వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటువేయాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మంగళవారం పట్టణంలోని 34వవార్డులో కౌన్సిలర్ రామిశెట్టి శివయ్య ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ జింకాచలపతి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాట్లాటపల్లె రోడ్డులో ఇంటింటికీ తిరుగుతూ పథకాల లబ్ధిని తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలిచి సీఎం జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ...గతంలో ఇంత పెద్దమొత్తంలో ప్రజలకు మేలు చేసిన ప్రభుత్వాలు ఏమైనా ఉన్నాయా అని ప్రజలను అడిగారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే పారదర్శకంగా పథకాలు అందిస్తున్నారని పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యేకు తెలిపారు. రామిరెడ్డి లేఅవుట్‌కు చెందిన భోజనపురాణి వివిధ పథకాల ద్వారా తనకు రూ.8లక్షల 26వేల 872 అందిందని ఎమ్మెల్యే ఎదుట సంతోషం వ్యక్తం చేసింది. మరో మహిళ తనకు ఇంటి పట్టా మంజూరైనా ఇప్పటివరకు స్థలం చూపలేదని చెప్పడంతో అక్కడికక్కడే సచివాలయ వీఆర్వోను పిలిచి తక్షణమే సమస్యను పరిష్కరించారు. వచ్చే ఎన్నికల్లో మరోమారు ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డికి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మేస్త్రీశ్రీనివాసులు, ఎస్వీ.రమణ, వసీం, ఈశ్వర్‌నాయక్, పాల్‌చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ నందినితాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు శీలం రమేష్, బండిమనోహర్, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరురఫీ, సదాశివరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, ఎల్ఐసీ.సుధాకర్, రహీం, రెడ్డిశేఖర్, సచివాలయ కన్వీనర్ మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె లయన్స్‌క్లబ్‌కు అవార్డుల పంట



లయన్స్‌క్లబ్ సాధించిన అవార్డులతో అధ్యక్షులు, సభ్యులు

మదనపల్లె : లయన్స్ క్లబ్ ఆఫ్ మదనపల్లెకు లైన్‌స్టిక్ ఇయర్ 2021-22లో ప్రజలకు అందించిన విస్తృత సేవలకు అవార్డుల పంట పండిందని జిల్లా అధ్యక్షులు లయన్.భక్తవత్సలం రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక లయన్స్ కంటి ఆస్పత్రి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో లయన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ... మే7న బెంగళూరు కొరమంగళ క్లబ్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో మదనపల్లె లయన్స్‌క్లబ్‌కు జిల్లాలోనే బెస్ట్ రూరల్ క్లబ్, బెస్ట్‌విజన్‌కేర్, బెస్ట్ హంగ్రిలీఫ్, బెస్ట్ లయన్స్ ఐ హాస్పిటల్, వెటర్నరీ, రక్తదాన శిబిరాలకు సంబంధించి మొత్తం 13 అవార్డులు వచ్చాయన్నారు. వీటితోపాటుగా జిల్లాలోనే మొదటి సారిగా అత్యుత్తమ లయన్స్ ఇంటర్నేషనల్ లీడర్‌షిప్ అవార్డు ఏడీసీఎస్.లయన్ గౌతంరెడ్డికి రావడం శుభపరిణామం అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మదనపల్లెకు ఒకే ఏడాది 13 అవార్డులు రావడం ఇదే ప్రథమమని తెలిపారు. కార్యక్రమంలో 2021-22 లయన్ అధ్యక్షులు మార్పూరి మహేష్, 2022-23 అధ్యక్షులు లయన్.అప్పినపల్లెభాస్కరాచారి, కే.ఎస్.ఎన్.ప్రసాద్, బాబూలాల్‌భండారీ, లయన్‌భాస్కర్ నాయుడు, లయన్ లియోభవేష్ పాల్గొన్నారు.

కనువిందు చేసిన పుష్పయాగం



మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం స్వామికి పుష్పయాగం భక్తులకు కనువిందు చేసింది. ఆలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన మండపంలో స్వామి,అమ్మవార్లకు ప్రత్యేకంగా అలంలకరించారు. పుష్పయాగంకు దాతలు వివిధ రకాల పూలను తెప్పించారు. మల్లె, సంపంగి, చామంతి,రోజా, లిల్లి, కనకంబరాలు, బంతితో పాటు సుమారు 30 రకాల వివిధ రకాల పూలను అర్చకులు గోవర్ధన్‌భట్టార్ వేదమంత్రోచ్చారణలతో పుష్పయాగం చేశారు. వివిధ రకాల పూలతో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, మాజీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.